క్లుప్తంగా

ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు



శ్రీహరిపురం మెయిన్ రోడ్డులో నిలిచిన వాహనాలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం ప్రధాన కూడలిలో ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. శ్రీహరిపురం నుంచి మల్కాపురం వైపు వచ్చే మార్గంలో రోడ్డుపై అడ్డంగా ఆటోలను నిలపడం, వీటికి తోడు అక్కడి పలు వాణిజ్య సముదాయాల ముందు వాహనాలను పార్క్‌చేయ్యడం, వీటీ కాలేజీ మార్గం నుంచి మల్కాపురం వైపు వాహనాలు మలుపు తిప్పి అవి మధ్యలో నిలచిపోవడం వంటి కారణాల వల్ల ట్రాఫిక్ స్తంభించింది. దీంతో గాజువాక నుంచి మల్కాపురం వైపు వచ్చే వాహన చోదకులకు ఇబ్బంది పడ్డారు.

శిథిలావస్థలో బీటీ రోడ్డు



గంగానగర్‌లో పిక్క తేలిన రోడ్డు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు గంగానగర్ సామాజిక భవనం వద్ద గల బీటీ రోడ్డు శిథిలావస్థకు చేరింది. ఐదేళ్ల కిందట ఇక్కడ లక్షల వ్యయంతో దీనిని అధికారులు నిర్మించారు. ఈ మార్గం పిక్క తేలి, రంధ్రాలు ఏర్పడి ఉండటంతో ఇటువైపు వచ్చే పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై స్థానికులు గతంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నేటికి స్పందన లేదు. ఈ సమస్యపై స్పందించాలని రోడ్డును బాగు చేయాలని గంగానగర్‌వాసులు కోరుతున్నారు.

కరాటేలో ప్రతిభావంతులకు మెరిట్ సర్టిఫికెట్ల ప్రదానం



మెరిట్ సర్టిఫికెట్ అందిస్తున్న నాయకులు

మల్కాపురం: ఆంధ్ర షోటోకాన్ కరాటే డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీ మైదానంలో కరాటే బెల్ట్ గ్రేడ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటేలో ప్రతిభ చూపిన వారికి అతిథి వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి సత్యనారాయణ గ్రేడ్ టెస్ట్ బెల్ట్‌లు, మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోనూ, స్వప్న, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం



అప్పన్న ఆలయంలో కరుణాకరరెడ్డి

సింహాచలం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు అగ్రవర్ణ పేదలను కూడా ఆదుకుంటున్న ఏకై క ముఖ్యమంత్రిగా వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకరరెడ్డి తెలిపారు. సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలోను లేని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషు అమల్లో కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధనలను సరళీకృతం చేసి రాష్ట్రంలో రూ. 8లక్షల ఆదాయ పరిమితి పెట్టడం హర్షణీయమన్నారు.

పచ్చదనానికి తూట్లు

- ఇష్టానుసారంగా గ్రీన్‌బెల్ట్‌ల ఆక్రమణ
- వ్యాపారాలు, వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిన వైనం
- దృష్టి సారించని అధికారులు

కంచరపాలెం: స్వప్రయోజనాల కోసం కొందరు పచ్చదనానికి తూట్లు పొడుస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించే గ్రీన్‌బెల్ట్‌లను ఇష్టానుసారంగా ఆక్రమించేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు. కంచరపాలెం, తాటిచెట్లపాలెం కూడలి నుంచి ఆర్ అండ్ బీ బిర్లా జంక్షన్ వరకు జాతీయ రహదారి పక్కన గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేశారు. దీనిలో మొక్కలు పెంచాల్సి ఉన్నా.. అవి నాటిన జాడే కనిపించడం లేదు. గతంలో జీవీఎంసీ కమిషనర్లు కోట్ల రూపాయలు వెచ్చించి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ గ్రీన్‌బెల్ట్‌లో కొంత మంది వ్యాపారులు పాగా వేసి తమ అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఫలితంగా పచ్చదనం కనుమరుగవుతోంది. అదే విధంగా జీవీఎంసీ లక్ష్యం కూడా నీరుగారుతోంది.

ఇదీ పరిస్థితి..

- కంచరపాలెం, ఊర్వశి కూడలి, తాటిచెట్లపాలెం, ఐటీఐ జంక్షన్, మర్రిపాలెం, శ్రీనగర్ ప్రాంతాల పరిధిలోని గ్రీన్‌బెల్ట్.. ఆటోలు, కార్లు, మరమ్మతుల వాహనాలతో నిండిపోయింది. ఏళ్ల తరబడి వాటిని తొలగించకపోవడంతో తుప్పుపట్టి రోడ్లపైనే అడ్డంగా పార్క్‌చేసి వదిలేశారు.
- రవీంద్రనగర్, దుర్గానగర్, రెడ్డి కంచరపాలెం, ధర్మానగర్, తిక్కవానిపాలెం, కప్పరాడ దేవేంద్రనగర్ ప్రాంతాల గ్రీన్‌బెల్ట్ స్థలంలో ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్‌లను సైతం తొలగించి వారికి అనుగుణంగా మార్చుకున్నారు.
- కంచరపాలెం కూడలిలో గ్రీన్‌బెల్ట్‌ను తొలగించి చేపలు, మాంసం విక్రయిస్తున్నారు. చెత్తాచెదారాన్ని సక్రమంగా తొలగించకపోవడంతో గ్రీన్‌బెల్ట్ దుర్గంధభరితంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.
- కంచరపాలెం సన్‌రైజ్ క్లబ్, షిర్డీసాయి ధ్యాన మందిరం పక్కన గ్రీన్‌బెల్ట్‌లో వ్యాపారులు కొంతమంది ఇసుక, పిక్క, ఇటుకలు నిల్వ చేసి వ్యాపారాలు చేస్తున్నారు. వాటి ఎగుమతులు, దిగుమతుల సమయంలో జాతీయ రహదారిలో గ్రీన్‌బెల్ట్ సబ్‌వేను ఆక్రమిస్తున్నారు.
- బిర్లా, కప్పరాడ జంక్షన్ ప్రాంతాల్లో బస్టాప్‌ల పక్కన బడ్డీలు, ఇతర తోపుడు బండ్ల దుకాణాలు వెలిశాయి.
- ఇండస్ట్రియల్ ప్రాంతంలో గ్రీన్‌బెల్ట్‌ను పూర్తిగా తొలగించి కార్ల షోరూమ్‌కు చెందిన వాహనాలను పార్క్ చేస్తున్నారు.
- జోగారావు నగర్, ధర్మా నగర్, గంగన్న నగర్ ప్రాంతాల గ్రీన్‌బెల్ట్ వెనకాల ఎక్కువగా తుక్కు, పాత సామగ్రి దుకాణాలు నిర్వహిస్తున్నారు. వాటికి వచ్చే చెత్తాచెదారాన్ని పెద్ద మూటలుగా కట్టి గ్రీన్‌బెల్ట్‌లో నిల్వ చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు.
- ప్రభుత్వ స్థలంలో పచ్చదనాన్ని రూపు మాపి కొంత మంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ రహదారి పక్కన రూ.కోట్లు ఖర్చు పెట్టి గ్రీన్‌బెల్ట్‌లు ఏర్పాటు చేస్తే ప్రస్తుతం అక్కడ పచ్చదనం కనిపించడం లేదు. జోన్–5 అధికారులు దృష్టి సారించి గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని పలువురు స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



గ్రీన్‌బెల్ట్‌లో ఉంచిన ఇనుప సామగ్రి



కంచరపాలెం-శ్రీనగర్ గ్రీన్‌బెల్ట్‌లో కార్ల పార్కింగ్

మా కడుపులు కొట్టొద్దు

- కంచరపాలెం మార్కెట్ మూసివేతపై వ్యాపారుల ఆందోళన



మార్కెట్ బయట ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

కంచరపాలెం: దశాబ్దాల కాలంగా ఇక్కడే కూరగాయలు, చేపలు అమ్ముకుంటున్న తమపై గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం నాయకులు కక్ష కట్టి మార్కెట్‌ను ఖాళీ చేసే ప్రయత్నం చేయడం దుర్మార్గమని వ్యాపారులు ఆదివారం ఆందోళనకు దిగారు. శనివారం అర్ధరాత్రి మార్కెట్‌కు తాళాలు వేసి వ్యాపారాలు జరగకుండా ఇసుక, మట్టి రహదారికి అడ్డంగా వేయడంతో చిరు వ్యాపారులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మీడియాతో వారు మాట్లాడుతూ ఏ సంబంధం లేని గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం సభ్యులు 70 ఏళ్లగా అద్దెలు, కరెంటు బిల్లుల రూపంలో ఆశీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. కంచరపాలెం మెట్టుపై స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా, వ్యాపారులను ఆశీల రూపంలో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ స్థలంలో భారీ భవనాన్ని నిర్మించి తమనే తరిమేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్డీవో, కలెక్టర్‌లను ఆశ్రయించామని చెప్పారు. కోర్టులో స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ నిర్మాణాలు ఆపకుండా వ్యాపారాలను అడ్డుకుని తమ పొట్ట కొట్టడం అన్యాయమని వాపోయారు. ఆదివారం మార్కెట్ నిలిచిపోవడంతో ఇక్కడ వ్యాపారాలు చేస్తున్న 142 దుకాణాల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మార్కెట్‌కు తాళాలు వేయడంతో తెచ్చిన కూరగాయలు, చేపలు నష్టపోయామన్నారు. తమ స్థలంలో వ్యాపారాలు చేయనివ్వకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వ్యాపారులు కోరారు. రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న వ్యాపారులతో ఆదివారం డీసీపీ–2 ఆనంద రెడ్డి, ఏసీపీ నరసింహమూర్తి, సీఐ విజయకుమార్ మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు వ్యాపారులు తెలిపారు.

గ్రామదేవతల ఆలయాల అభివృద్ధి కమిటీ ఎన్నిక

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువాని పాలెంలోని గ్రామదేవతల ఆలయాల అభివృద్ధి, ఉత్సవ కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. గ్రామ పెద్దలు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భీశెట్టి కృష్ణ, అధ్యక్షుడిగా బొడ్డేటి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా అక్కిడిరెడ్డి సత్యనారాయణ,, కోశాధికారిగా కాళ్ల సత్యనారాయణ, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. గ్రామదేవతలు కుంచుమాంబ, దుర్గమాంబ, ముత్యమాంబ, జువ్వమాంబ ఆలయాల అభివృద్ధికి ఈ కమిటీ కృషి చేస్తుంది.

కొలువుదీరిన కార్యవర్గం

కూర్మన్నపాలెం : గోదావరి రెడ్డి వేల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకొన్నారు. ఈ కార్యవర్గంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా తాడి శ్రీనివాసరెడ్డి, సెక్రటరీగా రత్నరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా అమ్మిరెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులతో గౌరవాధ్యక్షుడు డాక్టర్ బుల్లయ్యరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి గాజువాక వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

వెంకటాద్రి.. ఆధ్యాత్మిక ఝురి



వెంకన్న ఉత్సవమూర్తులు



సామూహికంగా హారతి అందజేస్తున్న భక్తులు

- ఘనంగా సుదర్శన హోమం
- విశేషంగా పుష్పయాగం

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. గోవింద నామస్మరణ మార్మోగింది. ఇక్కడ నిర్వహించిన సుదర్శన హోమం, పుష్పయాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండం వద్ద సుదర్శన పెరుమాళ్‌ను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై వేంజేపచేసి పుష్పయాగం వైభవంగా చేశారు. గోదాదేవికి కుంకుమార్చన నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దంపతులు, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 96వవార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు సుదర్శన హోమంలో పాల్గొన్నారు. దేవస్థానం ఈవో నీలిమ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ అర్చకుడు రామనుజమ్, వైదికులు అనంతాచార్యులు తదితరులు కార్యక్రమాలను నిర్వహించారు.

సంక్రాంతి కానుకగా డివిడెండ్ల పంపిణీ

- అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి



మహాజన సభలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి

సింహాచలం: సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సంఘ సభ్యులంతా సహకరించాలని అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి కోరారు. సొసైటీ మహాజన సభ ఆదివారం అడవివరం ప్రియాగార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడారు. సొసైటీలో పేరుకుపోయిన బకాయిలు చాలా ఉన్నాయని వాటిని రికవరీ చేసేందుకు పాలకవర్గం సమష్టిగా కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా 2015 మార్చి 31వరకు బకాయిలు చెల్లించని వారికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా క్లియర్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్టు తెలిపారు. వారి రుణాలను బట్టి 18 శాతం వడ్డీ నిర్ణయించడం జరుగుతుందన్నారు. గ్రాము బంగారానికి ప్రస్తుతం ఇస్తున్న రూ. 3వేల రుణాన్ని రూ. 3,200లకు పెంచుతున్నట్టు ప్రకటించారు. 12 వడ్డీ మాత్రమే బంగారంపై రుణం వసూలు చేయడం జరుగుతుందన్నారు. 2019 మార్చి 31లోపు బంగారు రుణాలు చెల్లించని వారంతా లోన్లు క్లియర్ చేసుకోవాలని, వారందరికీ ఎక్స్‌ట్రా 2 శాతం వడ్డీ తగ్గించడం జరుగుతుందని పేర్కొన్నారు. మార్ట్‌గేజ్ రుణాలు రూ. 25లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. సంక్రాంతి కానుకగా ఈనెల 12 నుంచి సభ్యులకు డివిడెండ్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. షేర్‌క్యాపిటల్‌పై 20 శాతం, త్రిఫ్ట్ డిపాజిట్‌పై 8 శాతం కలిపి డివిడెండ్ల రూపంలో చెల్లించడం జరుగుతుందని వెల్లడించారు. కాగా సొసైటీ తరపున పెట్రోల్‌బంక్, సూపర్ మార్కెట్, గ్యాస్ ఏజెన్సీ నిర్వహించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు లేబర్ యాక్ట్ వర్తింపజేయాలని మాజీ సభ్యుడు సతివాడ శంకరరావు కోరారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేశ్వరరావు, డైరెక్టర్లు కొలుసు గురునాథరావు, గేదెల కృష్ణం నాయుడు, బోర ప్రసాదరెడ్డి, ఆకుల నాగరాజు, పాలూరి సూరిబాబు, లండ వెంకటరమణ, గునిశెట్టి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావ, పోలవరపు రాజకుమారి, సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో 'వాల్తేరు వీరయ్య' సందడి





విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న సినీ హీరోలు చిరంజీవి, రవితేజ

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో వాల్తేరు వీరయ్య సినిమా యూనిట్ సందడి చేసింది. విశాఖలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో మెగాస్టార్ చిరంజీవి, ఆయన భార్య సురేఖ, కుమార్తె శ్రీజ, మరో హీరో రవితేజ, డైరెక్టర్ బాబి, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తదితర చిత్ర యూనిట్ సభ్యులు వచ్చారు. అక్కడ ఉన్న అభిమానులు సెల్‌ఫోన్లతో వీడియోలు, ఫొటోలు తీస్తూ సందడి చేశారు. మరికొందరు వారితో సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. విమానాశ్రయం నుంచి ఈ బృందం నగరంలోకి రోడ్డు మార్గాన వెళ్లారు.

ఘనంగా హిందుస్థాన్ షిప్‌యార్డ్ కళాశాల స్వర్ణోత్సవాలు

- ఆడిపాడిన పూర్వ విద్యార్థులు




ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి జ్ఞాపిక అందించి సత్కరిస్తున్న అపెక్స్ కమిటీ ప్రతినిధులు

సింథియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కాలేజీ ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకల్లో దేశ విదేశాల నుంచి పూర్వ విద్యార్థులు పాల్గొని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సందడి చేశారు. ముఖ్య అతిథి షిప్‌యార్డ్ డీసీపీ గుప్తా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరో అతిథి ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ కళాశాల గోల్డెన్ జూబ్లీ అపెక్స్ కమిటీ ప్రతినిధులను అభినందించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం అతిథులకు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సత్కరించారు. 1,200 మంది పూర్వ విద్యార్థులు సమావేశమై ఆడిపాడారు. వేడుకల్లో అపెక్స్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ అప్పారావు, శ్రీనివాసరెడ్డి, శరగడం వెంకట్, గుండుబోయిన మురళీకృష్ణ, ఆనంద్, ఏయూ రిజిస్టర్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కేరళ ఉత్సవాలు



క్రీస్తు గీతాలాపన చేస్తున్న కేరళ బ్యాండ్ పార్టీ



ఆకట్టుకుంటున్న క్రీస్తు జననం సెట్

మురళీనగర్: నగరంలోని కేరళీయులందరూ క్రిస్మస్ తోపాటు నూతన సంవత్సర వేడుకలను బిర్లా కూడలిలోని కళా సమితి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. కేరళ మలబార్ చర్చి ఫాదర్ రెవరండ్ జోఫీ చిరయాత్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం కేరళ నుంచి వచ్చిన ఆర్కెస్ట్రా క్రీస్తు స్తుతి గీతాలు ఆలపించారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలుపుతూ ఏర్పాటు చేసిన అలంకరణ ఆకట్టుకుంది. నగరంలోని కేరళీయులందరూ తరలివచ్చి సందడి చేశారు. కార్యక్రమంలో కేరళ కళా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఎం పిళ్లై, కె.హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల ఆరాధ్యుడు బ్రెయిలీ



మాట్లాడుతున్న అజయ్‌రాజ్

పరవాడ: అంధులకు ఆదర్శంగా లూయిస్ బ్రెయిలీ నిలిచారని.. ఆరు చుక్కలతో అంధుల జీవితాల్లో వెలుగులు నింపారని పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ అన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లా అంధుల సమాఖ్య ఆధ్వర్యంలో మరిడిమాంబ కల్యాణమండపంలో లూయిస్ బ్రెయిలీ 214 జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అజయ్‌రాజ్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం మండల కేంద్రంలో శాశ్వత భవనం మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అంధులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు కోరారు. రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకొని అంధులు ముందుకు సాగాలన్నారు. సాధన సంస్థ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ సూచించారు. విశాఖ జిల్లా అంధుల ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.అర్జునరావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా అంధుల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పారు. అనంతరం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 400 మంది అంధులకు బహుమతులు అందజేశారు. ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమంగా ఉక్కు పోరాటం



దీక్షా శిబిరంలో కూర్చున్న మంత్రి రాజశేఖర్, నిర్వాసితులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని, దానిని ఎలా ప్రయివేటుపరం చేస్తారని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు నడుపూరు గాంధీ పార్కు ఎదుట ఆదివారం ఉదయం 8 గంటలకు 24 గంటల నిరాహారదీక్షను ప్రారంభించారు. వీరి దీక్షకు నడుపూరు గ్రామ ప్రజలు, కాంట్రాక్ట్ కార్మికులు, స్టీల్ కార్మికులు, అఖిల పక్షాల కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు సంఘీభావం తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై కేంద్రం ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని డిమాండ్ చేశారు.

యునైటెడ్ ప్యానల్‌కు పూర్తి సహకారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపొందిన జ్యోతిరావు పూలే యునైటెడ్ ప్యానల్‌కు పూర్తి సహకారం అందిస్తామని ప్రస్తుత గుర్తింపు సంఘం, జ్యోతిరావు పూలే ఫౌండర్స్ ప్రధాన కార్యదర్శి నక్క వెంకటరమణ తెలిపారు. తమ హయాంలో ఓబీసీ ఉద్యోగుల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి చేసి అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో తమపై నమ్మకం ఉంచి ఓటు వేసిన 864 మంది ఓబీసీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన యునైటెడ్ ప్యానల్ పాలకవర్గం ఓబీసీ ఉద్యోగుల కోసం మంచి కార్యక్రమాలు చేపట్టగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల కోసం చేసే కార్యక్రమాలకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



అప్పికొండ తీరంలో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: పూర్వ విద్యార్థులు సందడి చేశారు.. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.. ఆలింగనం చేసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అప్పికొండ తీరంలో ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు.. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. వారు తమకు విద్యను బోధించిన గురువులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వుడా సూరరాజు, పెంటబాబు, కర్రి మాణిక్యం, మహ్మద్ సఫీ, నజీర్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.